# జ్ఞానోదయం




గౌతమబుద్ధుడికి ముసలాడిని, రోగిష్ఠిని, శవాన్ని చూసి అలనాడు జీవితంమీద విరక్తి కలిగినట్టు, కొండలికి కూడా తన జీవితంమీద విరక్తి పుట్టు కొచ్చింది. కొండలికి తన ప్రస్తుతపు జీవితంమీద విరక్తి కలిగించిన దృశ్యం—

చిన్న మీసాలతో, కాళ్లకు అంటుకు పోయిన పాంటు, ధగధగ మెరిసిపోతున్న రంగురంగుల టెరిలిన్ బుష్‌షర్టులో, ఎప్పుడూ రైలుఇంజనులా భుగభుగ పొగ వదులుతూ, నల్ల కళ్ల అద్దాలతో పోజులు విసురుతూ, పట్నం నుంచి దిగిన పాలేరు మల్లయ్య కొడుకు నారిగాడు. నారిగాడు మూడు నెలల క్రితం ఇంటిలో చెప్పకుండా పట్నానికి చెక్కేశాడు. చింకి బట్టలతో అందరిని చుట్టముక్కలు అడుగుతూ ఊరకుక్కలా తిరిగేవాడు. అలాటిది ఇప్పుడు వాడు ఈ కొత్త అవతారం ధరించి ఊళ్లో దిగాడు.

నారిగాడు చెప్పే సినిమా కబుర్లు, వాడు పట్నంలో జరిపిన ప్రేమకలాపాలు వింటూంటే కొండలి కళ్లు తెరుచు కున్నాయి. తను ఈ పల్లెటూరిలో పాలేరులా ఉండి రోజల్లా ఎద్దులా పని చేసి కూటికి, బట్టకి వాచిపోతున్నాడు. ఏం, తనుకూడా నారిగాడిలా పట్నంలో పనిచేసి మహారాజులా ఉండకూడదా? అనుకోవడం ఏమిటి, కామందుకి చెప్ప కుండా పట్నానికి ఉడాయించాడు. నా అన్నవాడు ఊళ్లో ఉంటేకదా వ అడ్డదానికి!

పట్నానికి ఈ వేషంతో వె బాగుంటుందా? బయలుదేరే ము వేషం మార్చేశాడు. మంగలి వన్న మస్కా కొట్టి క్రాపింగు చేయ కున్నాడు. చిన్నబాబుగారిని, అనగా కామ రెండో కొడుకుని బతిమాలి బతి పాత చింకి బుష్‌షర్టు సంపాదిం పాంటు మాత్రం దొరకలేదు క

పాతించెనే మూడుసార్లు సబ్బు పెట్టి ఉతికి కట్టుకున్నాడు. ఎలుగు తోలు ఎంత తోమినా తెల్లబడదన్నట్టు, ఆ పంచె తెల్లబడలేదు. బుష్‌షర్ట్ ధరించి, జుట్టుకి ఎన్నడూ పరిచయంలేని నూనె రాసి, జేబులో తను వెనకేసిన ధనరాశిని, అనగా పదకొండు రూపాయలూ వేసుకుని పట్నానికి ఉడాయించాడు. పట్నానికి రైలు టికెట్టే ఏడు రూపాయ లయింది.

పట్నంలో దిగి తెగ తిరిగాడు కొండలు. ఆఖరికి ఒక కాఫీక్లబ్బులో కప్పులు, ప్లేట్లు కడిగే పని దొరికింది.

ఆ క్లబ్బుకి రోజూ ఒక ఆసామీ వస్తూ ఉండేవాడు. సిల్కు చొక్కా, మెలి తిరిగిన మీసాలూ, చేతివేళ్లకి తళతళ మెరిసే ఉంగిరాలూ— చాలా దర్జాగా ఉండేవాడు. ఒక రోజు చేయి కడుక్కోవడానికి కుళాయి దగ్గరకు వచ్చి, కొండలుని దగ్గరగా పిలిచి రహస్యంగా తన ఇంటి చిరునామా ఇచ్చి కలుసుకోమన్నాడు. కొండలు ఆ ఆసామీ ఇంటికి వెళ్లాడు.

"ఏభయి రూపాయల జీతం, తిండి, బట్ట, సిగరెట్లు ఇస్తాను. ఇంటిలో పని,బయట పని చేయాలి. నే నొక్కడినే. నాకు పెళ్లాం, పిల్లలు లేరులే" అన్నాడు ఆ ఆసామీ. కాఫీక్లబ్బులో 24 గంటలూ పనిచేయాలి. ఆ ఆసామీ ఒక్కడే కబట్టి తనకు తీరిక ఉంటుంది. క్లబ్బులో 20 రూపాయల జీతం. ఇక్కడైతే 50 రూపాయల జీతం. "సరే" అన్నాడు కొండలు.

ఆ ఆసామీ ఇంటిలో పనిచేస్తున్న కొండలు జీవితం బాగానే నడుస్తోంది. రెండు పూటలూ చక్కటి భోజనం, కిళ్లీ, సిగరెట్లు, పాంట్లు, బుష్‌షర్టులు- అన్నీ లభిస్తున్నాయి. అట్టే పనికూడా లేదు. ఆ ఆసామీ కాస్త మందు తాగి అడపా తడపా బూతులు తిట్టేవాడు. అంతే. అది కొండలికి అలవాటేగా!

కొండలి అదృష్టం ఎటువంటిదో కాని, ఆ సుఖంకూడా అంతమొందింది. ఒక రోజు తెల్లవారుజామున పోలీసువాళ్లు యజమాని ఇంటిని సోదా చేశారు. యజమాని ఇంటిలో లేడు. విదేశీ తాగుడు బుడ్లూ, వాచీలూ, ఇంకా ఏమేమిటో స్మగుల్డ్ సామానులూ కొల్లలుగా దొరికాయి. కొండలుని పోలీసుస్టేషనుకి లాక్కెళ్లారు. తరవాత యజమాని పోలీసుస్టేషనుకి వచ్చాడు. కొండలు మొహం విప్పారింది. తనను ఇంక వదిలేస్తారని ఆశపడ్డాడు. కాని, ఏమి దారుణం? యజమాని పోలీసు అధికారులకు ఏమి చెప్పాడో, ఏమి ఇచ్చాడో కాని వాళ్లు కొండలుని వదలలేదు.

"ఆ సామాన్లు నీవేనట. నీ యజమానికి వాటి గురించి ఏమీ తెలియదట" అన్నారు పోలీసువాళ్లు. తనకు ఏమీ తెలియదని ఎంత చెప్పినా వాళ్లు వింటేగా! చిన్న పిల్లాడిలా ఏడుస్తోంటే పోలీసువాళ్లు కొండలుని చూసి నవ్వారు.

పోలీసువాళ్లు కొండలుపై కేసు పెట్టారు. తను ఎంత మొత్తుకున్నా న్యాయమూర్తి వింటేగా?

నిజంగా చట్టానికి కళ్లూ, చెవులూ ఉండవని ఆ రోజే తెలుసుకున్నాడు కొండలు. తను ఎప్పుడూ వాచీ మొహం చూడలేదనీ, అసలు టైము చూడడమే రాదనీ చెప్పాడు. కల్లు తాగాడే కాని, జీవితంలో బుడ్డీ తాగుడు ఎలా ఉంటుందో తను చవిచూడలేదని చెప్పాడు. కోర్టులో అంతా ఫక్కున నవ్వారు. ఆ సామానులు తన కావని ఏడుస్తూ మొర పెట్టుకున్నాడు.

తను ఎప్పుడూ ఎరుగని ఇద్దరు మనుషులు వచ్చి తనని వాళ్లకి బాగా తెలుసునని, తను స్మగుల్డ్ సామానుల వ్యాపారం చేస్తున్నట్టు వాళ్లు ఎన్నోసార్లు గమనించారని సాక్ష్యం ఇచ్చారు. యజమాని తాను పేరు మోసిన పెద్దమనిషినని, ఇంత కాలం అంత మర్యాదగా బ్రతుకుతూ తుదకు ఇలాటి అఘాయిత్యానికి ఎందుకు ఒడికడతానని సవాలు చేశాడు. కొండలు వచ్చిన దగ్గరనుండి తనకు అనుమానంగానే ఉందట. వాడు రాత్రిళ్లు ఇంటిలో ఉండకపోవడం, తప్పతాగి వస్తూండడం, తను ఇంటిలోకి వచ్చినప్పుడల్లా అదో మోస్తరుగా ప్రవర్తిస్తూండడం గమనిస్తూనే ఉన్నాడట. ఒక రోజు వాడు ఒక పెద్ద సూటుకేసు ఇంటిలోకి చేరవేస్తూండగా చూసి వాడిని అడిగితే, 'అబ్బే, ఏమీలేదండీ. మా నాన్న మా ఊరినుండి నాకు బట్టలు పంపించాడండి' అని బొంకాడట.

ఇంకేముంది? కొండలికి ఆరు నెలల కఠిన కారాగారశిక్ష విధించబడింది. సాలేరు పని చేసి ఒళ్లు దిమ్మతేరిపోయిందేమో, జైలులో చేసే పని ఏమీ అంత కఠినమైనదిగా అనిపించలేదు. వేళకి హాయిగా ఏదో తిండి దొరికేది. ఇదీ బాగానే ఉందనుకున్నాడు. కాని, అయిదు నెలలు తిరక్కుండానే కొండలుని విడుదల చేశారు. తన మంచి ప్రవర్తనను మెచ్చి ఒక నెల ముందే విడుదల చేశారట. మంచి ప్రవర్తనకూడా ఈ పాడు లోకంలో హానే తెచ్చిపెడుతుందికదా అని కొండలు విడుదలరోజు అనుకున్నాడు.

సుఖంగా బ్రతకాలన్న కోర్కె కలగడం ఆరంభించిందా అందుకు అడ్డదారులు త్రొక్కడం ప్రారంభం అవుతుంది. కష్టపడి పనిచేసి నాలుగు డబ్బులు సంపాదించడంపై ఏవగింపు కలిగి, మోసగించి క్షణాల మీద డబ్బు గడించాలన్న మోతుబరీ ఆశయం మెదడులో తొలుస్తుంది. అది ఫలించడానికి మోసం జ్ఞానోదయం కలిగిస్తుంది.

జైలు బయటకు వచ్చి కొండలు ఎక్కడకు పోవడం, ఏమిటి చెయ్యడం అని ఆలోచించాడు. క్లబ్బువాడు వచ్చినా తనకు ఉద్యోగం ఈయడు. తన ఊరికి కుచేలుడి రూపంలో మాత్రం వెళ్ల కూడదు. వెళ్లితే నారిగాడిలా రంగేలిరాజాలాగే వెళ్లాలి. అలా రోడ్డు వెంబడి వెళుతూండగా రోడ్డుపక్క జనం గుమిగూడి ఉండడం చూసి దగ్గరగా వెళ్లాడు. ఎవరో స్వాములవారు. ఉపన్యాసం దంచేస్తున్నారు. పెద్ద గడ్డం, మెడలో రుద్రాక్ష తావళం, సిల్కు కాషాయ వస్త్రాలు. చూడగానే ఆయన యందు సహజంగా ఆదరభావం పుట్టుకొస్తోంది. జనం భక్తిశ్రద్ధలతో ఆయన చెప్పే ప్రతి మాటా వింటున్నారు. ఆయన మొహంమీద చిరునవ్వు ఎప్పుడూ తాండవమాడుతూ ఉంది.

"నాయనలారా! నేను సన్యాసిని. ఏ ఇంటికి వెళ్లి అడిగినా నాకు కొద్ది మెతుకులు దొరక్కపోవు. నాకు మీ ముందు చేయి చాచే అవసరం ఏ మాత్రమూ లేదు. కాని, నాకు ఒక దివ్యౌషధం చేసే విద్య వచ్చును కాబట్టి, దాన్ని ప్రజలకు చెప్పి రోగులకు ఆరోగ్యం చేకూర్చాలని నా ఉద్దేశ్యం. మానవసేవే మాధవసేవని మా గురువుగారు మాకు నూరి పోస్తూ ఉండేవారు" అని ఆయన కళ్లు మూసి తన గురువుగారికి నమస్కరించారు.

"మనకు సాధారణంగా అనారోగ్యం ఎందుకు కలుగుతుందో మీలో ఎవరైనా చెప్పగలరా? నువ్వు చెప్పు, నాయనా!" అని స్వాములవారు ఒక కళ్లజోడు బాబుని అడిగారు. ఆ బాబు, "సరిఅయిన ఆహారం లేక" అని జవాబు చెప్పాడు.

"కాదు, నాయనా. సరిఅయిన ఆహారం ఉన్నా వ్యాధులు వస్తాయి. నేను చెపుతాను. వినండి. మనకు సాధారణంగా అనారోగ్యం అజీర్ణం వల్ల కలుగుతుంది. అజీర్ణానికి ఈ ఓషధి బ్రహ్మాస్త్రం లాటిది. ఈ ఔషధం కడుపుకి సంబంధించిన 50 ఏళ్ల పాత జబ్బులనుకూడా పోగొడుతుందని నేను ఆ పరమేశ్వరుని సాక్షిగా చెపుతున్నాను. ఇంతేకాదు, దీన్ని సేవిస్తే తలనొప్పి, ఒళ్లునొప్పి, జలుబు లాటివి జీవితంలో రావు. ఆడవాళ్ల జబ్బులని ఇది క్షణంలో పోగొడుతుంది. బెణుకులకు, గాయాలకు, కాల్పులకు ఈ భస్మాన్ని రాస్తే అవి క్షణంలో నయమౌతాయి. దీన్ని పిల్లలకి రోజూ ఈయండి. వాళ్లు నెల్లాళ్లలో ఎత్తుగా, బంతులలా తయారవకపోతే నా తల తీయించేయండి. మీకు ఈ ఔషధంవల్ల ఏ గుణం కనబడకపోతే నేను మీకు ఈ జన్మలోనే కాదు, వచ్చే జన్మలోకూడా బానిసగా పనిచేస్తాను.

"ఈ ఔషధం చేసే విధానం మన శాస్త్రాలలోనే ఉంది. అందుకే మన ఋషులు, పూర్వీకులు నూరు సంవత్సరాలకు పైగా బ్రతికేవారు. వాళ్లు కళ్లజోళ్లు ఎరుగుదురా? పళ్లు కట్టించుకునేవారా? అంతెందుకు—నన్నే చూడండి. నా వయస్సు 84 సంవత్సరాలు. కాని 50 ఏళ్లవాడినన్నా ఎవరూ నమ్మరు!

"ఈ ఔషధం భస్మంరూపంలో ఉంటుంది. ఇదా నేను దాన్ని తయారు చేసే విధానాన్ని, దానికి అవసరమయ్యే సామగ్రిని, దాన్ని సేవించే పద్ధతిని, వివరిస్తాను. మీ రందరూ కాగితాలూ, పెన్సిళ్లూ బయటకు తీసుకోండి. కాగితాలూ, పెన్సిళ్లూ లేకపోతే, ఇదిగో, అందుకోండి! ఒక్కసారి మీరందరూ 'శ్రీమద్రమారమణ గోవిందా, గోవిందో

**పులిగడ్డ విశ్వనాథరావు**

అనండి. దేవుని పేరు స్మరించడంలో ఏమీ పాపం లేదు, నాయనలారా! కాస్త గొంతెత్తి అనండి. 'శ్రీమద్రమా రమణ గోవిందా, గోవిందో" అనండి" అని చెప్పి కాగితాలు, పెన్సిళ్ళ పంచి పెట్టారు. "కాగితాలతో సహా ఈ పెన్సిళ్ళకూడా తీసుకుపోవద్దు" అని చిన్న జోకుకూడా విసిరారు. అంతా నవ్వారు.

ఏవో ఓషధుల పేర్లు, కొన్ని మూలికల పేర్లు వ్రాయించి, వాటి గుణాలను మెచ్చుకొంటూ, అవి ఏయే రోగాలను నయం చేస్తాయో చెపుతూ, అవి ఎన్నెన్ని పాళ్ళ ఉండాలో వివరించారు.

ఆ ఉపన్యాసం విని కొండలు పరవశం చెందాడు. నిజంగా ఈ మహాత్ముడు ఎంత గొప్పవాడు! తనకు ఏ జబ్బూ లేక పోయినా ఆయన చెప్పిన ప్రతిమాటా శ్రద్ధతో విన్నాడు. ఒక బాబుని తనకి కూడా ఆ చిట్కా వ్రాసిపెట్టమని బతిమాలుకున్నాడు.

స్వాములవారు ఆ ఔషధాన్ని చేసే విధానం, అది సేవించే పద్ధతి చెప్పారు. ఆ ఓషధులనీ, మూలికలనీ పిడకలలో కలిపి భస్మం తయారు చేయాలట. తరవాత కాస్త బంగారపుపొడిసికూడా ఆ భస్మంలో చేర్చాలట. ఆ మూలికలు ఎక్కడ దొరుకుతాయని, బంగారం అతి ప్రియం కదా— దాని ఎలా చేర్చడమని జనం అడిగారు.

"నాయనలారా! మీరు ఈ మూలికలను సంపాదించగలిగితేనే ఈ భస్మం తయారు చేసుకోగలరు. ఈ మూలికలు అడవులలో, కొండలలో దొరుకుతాయి. మా లాటి వాళ్ళకు కాని, అవి సులభంగా లభించవు. అంతగా అవసరమైతే నా వద్ద కొద్దిగా ఈ భస్మం ఉంది. దాన్ని ఊర్కే కాదు, ఖరవైమందికి ఇస్తాను. దాన్ని విరివిగా అమ్మి డబ్బు చేసుకోవాలని కాదు నా ఉద్దేశం. మానవసేవే మాధవసేవని నా నమ్మకం. కాకపోతే నేను నా ఆశ్రమం చిరునామా ఇస్తాను. ఆ భస్మాన్ని తెప్పించుకోండి.

"అయినా నేను ఒక్క మాట మనవి చేస్తాను. నేను ఇలా ప్రజాసేవ చేస్తుంటే నేను భిక్షాటన చేసేదెప్పుడు, జీవించడానికి నాలుగు మెతుకులు, సంపాదించేదెప్పుడు? ఇంతెందుకు? ఆ భస్మాన్ని చేయడానికి బంగారం కావాలి. నాకేమైనా జమీందారీ ఉందా? అందుకని ఆ భస్మానికి వెల పెట్టాను. అది నూరు రూపాయలు చేస్తుంది కాని, ఇప్పుడు నూరు కాదు, ఏభయి కాదు, పది కాదు, అయిదు కాదు, రెండు రూపాయలు మాత్రమే దాని వెల. దానిలో బంగారమే ఒక రూపాయి వెల చేస్తుంది" అని చిన్న చిన్న సీసాలు సంచీలోంచి తీశారు.

"ఈ సీసామీద రిజిష్టర్డు నంబరు, నా చిరునామా ఉన్నాయి. దొంగవాడి! చిరునామా ఉండదు, నాయనా! మీకు అవసరమైతే ఈ చిరునామాకి రాయి. పోస్టులో నీకు సీసా అందుతుంది కాని, అయిదు రూపాయలు ఖర్చవుతుంది. నీకు దీనివల్ల లాభం లేకపోతే, ఒక పోస్టు కార్డు రాయి. నీ ఖర్చు నీకు తిరిగి వస్తుంది. కాని అలాటి ఒక్క ఉత్తరం ఇంతవరకూ రాలేదు. అదంతా దేవుని దయ. ఇదిగో, ఈ భస్మాన్ని పంపమని నాకు మీ లాటి జనం రాసిన ఉత్తరాలు. ఇదిగో చదవండి" అంటూ ఒక పెద్ద ఉత్తరాల కట్ట విప్పి పడేశారు. కొంత మంది ఆ కార్డులు చదివి అతను చెప్తున్నది నిజమని తల ఊపారు.


"ఇలాటి ఔషధాలు తయారు చేసే విధానం చెప్పడానికి మీకు ఏ అర్హత ఉంది అని చాలామంది అడగవచ్చును. నేను ఆయుర్వేదంలో పట్టభద్రుణ్ణి. ఇదిగో నా ప్రమాణపత్రిక" అంటూ పెట్టెలో ఉన్న ఒక పాత ప్రమాణ పత్రికకూడా చూపెట్టారు.

జేబులోంచి డబ్బు తీసి ఆ మందు ముందుగా కొనుక్కోవాలన్న ప్రబల ఆత్రత చూసి, "తొందరపడకండి, నాయనలారా! ఇప్పుడే ఇస్తున్నాను. ఒక్కసారి శ్రీమద్రమారమణ గోవిందా గోవింద అనండి" అంటూ భస్మపు సీసాలను శ్రీరామపట్టాభిషేకం పటం మీద ఉంచి అమ్మ నారంభించాడు.

క్షణాలలో ఇరవై ఏమిటి ముప్ఫై సీసాలు అమ్ముడు పోయాయి. తన దగ్గర ఉన్న కాస్త డబ్బులో రెండు రూపాయలు ఇచ్చి కొండలుకూడా ఒక సీసా కొనుక్కున్నాడు. మరి దానిలో బంగారంకూడా ఉంది కదా!

అక్కడినుండి బయలుదేరి మధ్యాహ్నం కాస్త ఎంగిలిపడి సాయంకాలానికి తిరిగి తిరిగి ఊరి బయట ఉన్న రావి చెట్టు క్రింద చేరాడు. ఆ చెట్టు క్రిందే భస్మం అమ్మే స్వాములవారు కూడా బస చేసివట్టున్నారు. ఆ స్వాములవారు పిడకలమీద వంట వండుకుంటున్నారు. కొండలు కాస్త దూరంగా రావిచెట్టు మొదలు చుట్టూ ఉన్న అరుగుమీద చేరగిలబడి స్వాములవారిని గమనిస్తున్నాడు. వంట అయాక భోజనం చేసి పిడకల బూడిదని కుప్పగా పోశారు. తరవాత సంచీలోంచి ఉత్త సీసాలు తీశాడు. ఇదేమి ఘోరం! ఆ సీసాలలో ఆ బూడిదని పోస్తున్నాడే! పిడికేమి పోయే కాలం! అయితే తను కొన్న సీసాలో ఈ పిడకల బూడిదే. . . ఆ క్షణమే కొండలికి ఆ రావిచెట్టు క్రింద గౌతమబుద్ధుడిలాగే జ్ఞానోదయం కలిగింది.

ఇప్పుడు— అనగా పది సంవత్సరాల తరవాత కొండలు రెండు మేడలు కట్టించాడు తన ఊళ్ళో. ఇప్పుడు అతను పెద్ద మోతుబరి. అదిగో, రోడ్డు పక్కగా చుట్టూ గుమిగూడిన జనానికి సర్వరోగ నివారిణి అమ్ముతున్న ఆ స్వాములవారు మరెవరో కాదు, కొండలే.






సుప్రసిద్ధ పండితులు, కవి, దర్శనాచార్యులు, కళావిమర్శకులు శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు గారు సాహిత్య, కళారంగాలలో సవ్యసాచి. వీరి అపూర్వ సాహిత్య జీవితాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు "కళా ప్రపూర్ణ" బిరుదం ఇచ్చి సత్కరించారు.